మట్టిరోడ్లకు మహర్దశ

- తీరనున్న గ్రామప్రజల ఇక్కట్లు
- తారురోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న పల్లెవాసులు

సైదాపూర్: ఏళ్లుగా మట్టిరోడ్లతో ఇబ్బంది పడుతున్న ప్రజల ఇక్కట్లు ఇక తొలగనున్నాయి. చినుకుపడితే చిత్తడిగా మారే మట్టిరోడ్లు, ఇక నుంచి బీటీరోడ్లుగా మారనున్నాయి. కనీసం రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందిపడ్డారు. ఆరెపల్లి, గర్రెపల్లి, రాయికల్ తండా, నల్లాని తండాలకు తారురోడ్ల నిర్మాణానికి రూ.6.40 కోట్ల నిధులు మంజూరు కావడం పట్ల ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రోడ్ల మరమ్మతుకు ప్రభుత్వ పాలకులు, అధికారులు పూనుకోలేదు. సరైన సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పాలకులు, అధికారులను నిలదీశారు, ఎమ్మెల్యే, మంత్రుల చుట్టూ తిరిగారు, అయినా ఫలితం లేక విసిగిపోయారు.


ఆరెపల్లి మట్టిరోడ్డు

మండలంలో..

- మండలంలోని సోమారం గ్రామ పంచాయతీ పరిధి గర్రెపల్లికి కిలోమీటర్, గర్రెపల్లి నుంచి సైదాపూర్ రోడ్డువరకు రెండు కిలోమీటర్లు మట్టి రోడ్డుఉంది. వర్షాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారుతోంది. గ్రామస్తులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- ఆరెపల్లి వెన్నంపల్లి గ్రామ పంచాయతీ నుంచి కొత్త గ్రామ పంచాయతీగా ఏర్పడింది. వెన్నంపల్లి–సోమారం జెడ్పీ రోడ్ నుంచి గ్రామానికి తారురోడ్డు నిర్మాణం చేయాలని గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఏటా వర్షాకాలంలో బురదరోడ్డుపై వరినాటు వేసి నిరసన తెలిపారు.
- రాయికల్, ఘనపూర్, పెరుకపల్లి గ్రామాల పరిధిలో తండాలను ప్రభుత్వం రాయికల్‌తండా గ్రామ పంచాయతీగా చేశారు. కానీ ఈ తండాలకు సరైన దారి లేక పోవడంతో తండాల వాసులు తారురోడ్డు ఎక్కాలంటే సుమారు ఐదు కిలోమీటర్లు మట్టిరోడ్డుపై ఆయా గ్రామ పంచాయతీలకు అవసరాల కోసం వచ్చేవారు. విద్యా, వైద్యం, నిత్యావసరాల కోసం రోడ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డారు.
- చివరకు తారురోడ్ల నిర్మాణం నిధులు మంజూరు కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరెపల్లి రోడ్డుకు రూ.1.20, గర్రెపల్లి నుంచి సోమారం, సైదాపూర్ జెడ్పీరోడ్డు వరకు రూ.2.40, ఘనపూర్ ఆర్‌అండ్‌బీరోడ్డు నుంచి రాయికల్ తండా, నల్లాని తండాలకు రూ.2.80 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలో పనులు చేపట్టనున్నారు.
- వర్షాకాలం ప్రారంభం కాక ముందే రోడ్డు పనులు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ చేపట్టాలి

వెన్నంపల్లి తారురోడ్డు నుంచి ఆరెపల్లి వరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ హుజూరాబాద్, మండల కేంద్రానికి పోవడానికి ఆరెపల్లి నుంచి జాగీర్‌పల్లి వరకు కూడా మట్టిరోడ్డు ఉంది. మరో కిలోమీటర్ తారురోడ్డుకు నిధులు మంజూరు చేయాలి. గ్రామంలో రోడ్డు నిర్మించేటప్పుడు రోడ్డు విస్తరణ చేపట్టాలి.

– ఆవునూరి పాపయ్య, సర్పంచ్, ఆరెపల్లి

రోడ్లు ఇరుకు చేశారు



గర్రెపల్లి గ్రామస్తుల రోడ్డు నిర్మాణ పోరాటం ఫలించింది. ఎట్టకేలకు సోమారం నుంచి గర్రెపల్లి, సైదాపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు తారురోడ్డు నిర్మించనున్నారు. గతంలో ఉన్న మట్టిరోడ్డుకు ఇరువైపులా రైతులు జేసీబీలతో తవ్వించి కందకాలు తీసి కబ్జా చేశారు. వెడల్పు, ఎత్తుగా ఉన్న రోడ్లు ఇరుకుగా చేశారు. నిబంధనల ప్రకారం రోడ్ విస్తరణ చేసి తారురోడ్డు నిర్మించాలి.

–పైడిమల్ల సుశీల, సర్పంచ్ సోమారం

వానాకాలంలోపు నిర్మించాలి



మండలంలోని మూడు తండాలను కలిపి ప్రభుత్వం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. రోడ్డు రవాణా సౌకర్యం లేక తండాల వాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యా, వైద్యం, నిత్యావసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రధాన సమస్య రోడ్డు సౌకర్యం, గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వర్షాకాలంలోపు రోడ్డు నిర్మించాలి.

– బర్మావత్ అక్షయ, సర్పంచ్ రాయికల్ తండా

క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ


భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామడుగు: మండలంలోని వెలిచాల జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను సోమవారం ఎంపీడీవో రాజీవ్‌మల్హోత్రా తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే కంటి వెలుగు శిబిరాన్ని తనిఖీ చేశారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ కవిత

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను సోమవారం ఎంపీపీ కలిగేటి కవిత ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్నే దర్శన్‌రావు, ఏఈ సచిన్, పంచాయతీ కార్యదర్శి రాజు, నాయకులు జూపాక మునీందర్, కిరణ్, మధు, తిరుపతి పలువురు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న లింగమూర్తి

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో సోమవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అధ్యక్షుడు లింగమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో బండారి తిరుపతి, అల్లెంకి వీరేశం, కర్మకొండ రాజయ్య, వంగ సత్తయ్య, సోమేశ్వర్, సాయిరామ్, మనోహర్, తిరుపతయ్య, తిరుపతమ్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగేందుకే 'దళితబంధు'

వీణవంక: దళితులు ఆర్థికంగా ఎదిగేందుకే సీఎం కేసీఆర్ దళితబంధు పథకం ప్రవేశపెట్టారని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఘన్ముక్కుల గ్రామానికి చెందిన లబ్ధిదారుడికి పథకం కింద మంజూరైన యూనిట్ వ్యవసాయ డ్రోన్‌ను సోమవారం ప్రాంభించారు. వీణవంక నుంచి లస్మక్కపల్లికి వెళ్లే దారిలో వ్యవసాయ పొలాల్లో డ్రోన్ పనితీరును పరిశీలించారు. దళిత బంధు వంటి పథకం దేశానికే ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, సర్పంచ్ నీల కుమారస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ కట్కూరి మధుసుదన్‌రెడ్డి, యాసిన్ తదితరులు ఉన్నారు.

అన్యాయం చేయొద్దు

చొప్పదండి: ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీలో అనాథలకు అన్యాయం చేయొద్దని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్ణారెడ్డి అధికారులకు విన్నవించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య పథకానికి ఆదాయ ధృవీకరణ పత్రం తప్పనిసరి కావడంతో లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. సింగిల్ పేరెంట్, తల్లిదండ్రులు లేని వారి పట్ల అధికారులు ఉదారత చూపాలని కోరారు. నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టొద్దని కోరారు. అనాథ పిల్లల్లో దళిత, బహుజన పిల్లలు అధికంగా ఉన్నందున వారికి న్యాయం చేయాలన్నారు.

తరలిరావాలి

చొప్పదండి: ఏప్రిల్ 14న దేశంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు దళితులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బడుగు నరేశ్ కోరారు. సీఎం కేసీఆర్ ఆవిష్కరించే విగ్రహం వద్దకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన

మానకొండూర్/మానకొండూర్‌రూరల్: మండలంలోని వేగురుపల్లిలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, గ్రామంలో నిర్మించిన యాదవ సంఘం భవనాన్ని ప్రారంభించారు. అలాగే గ్రామపంచాయతీ కార్యాలయ నూతన భవనం, మహిళా సంఘ భవనానికి భూమి పూజ చేశారు. ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు అందాలని ప్రభుత్వం గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు నెలకొల్పొంతుందని పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. గ్రామాల్లో ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. త్వరలో ఇళ్ల స్థలాలు ఉన్నవారికి మూడు లక్షల రూపాయలు అందజేస్తామన్నారు. అర్హులైన వికలాంగులకు సహాయక ఉపకరణాలు అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీఓ సబిత ఆధ్వర్యంలో రాష్ట్ర వికలాంగుల సంస్థ ఆలీమ్‌కో, వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయంతో వికలాంగుల సహాయక ఉపకరణాల ఎంపిక శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారుఉ. దరఖాస్తులు స్వీకరించి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని, మరో క్యాంపులో ఉపకరణాలు అందిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎంపీపీ ముద్దసాని సులోచన, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాజిదా అతహరి, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బియాబాను తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బహిరంగ సభకు తరలిరావాలి

గంగాధర: అంబేడ్కర్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపునిచ్చారు. సోమవారం నాయకులతో కలిసి మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, సభకు నియోజకవర్గం నుంచి బస్సుల సౌకర్యం కల్పిస్తున్నామని, దళితుల ఆర్థిక ఎదుగుదలకు సీఎం దళిత బంధు పథకం ప్రవేశపెట్టారని తెలిపారు.

రామడుగు: ఆర్టీసీ సంస్థలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పలు సేవలు అందించిన వెదిర గ్రామానికి చెందిన రిటైర్డ్ డీఎం కంకణాల లక్ష్మీపతి జాతీయ దళితరత్న అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే బూరుగుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. వెదిర గ్రామ వీడీసీ నాగుల రాజశేఖర్‌గౌడ్, అంబేడ్కర్ ఉత్సవ కమిటీ చైర్మన్ లంక మల్లేశం, నాయకులు శనిగరపు అర్జున్, పూడూరి మల్లేశం, శనిగరపు అనిల్, పెంటి శంకర్, మల్లేశం,రాము, అంజన్‌కుమార్, అనిల్ పాల్గొన్నారు.


రామడుగు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవిశంకర్

బీఆర్ఎస్‌కు యువతే అన్ని విధాలుగా బలమని ఎమ్మెల్యే అన్నారు. క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ యువ విభాగం నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పార్టీ అభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఆరెపల్లి ప్రశాంత్, బూదారపు కార్తీక్, బీరెల్లి అనిల్‌రావు, కొలిపాక కమలాకర్, బీరేష్ పలువురు పాల్గొన్నారు.

'తిమ్మాపూర్'ను స్ఫూర్తిగా తీసుకోవాలి

తిమ్మాపూర్: ఇటీవల జాతీయ పంచాయతీ అవార్డులకు తిమ్మాపూర్ మండలం ఎంపిక కావడం హర్షనీయమని ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలగిరి దివ్యదర్శన్‌రావు అన్నారు. మండలాన్ని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్‌లో జిల్లాలోని ప్రతి మండలానికి ఏదో ఒక స్థాయిలో అవార్డు తీసుకురావడానికి ఎంపీడీవోలు కృషి చేయాలన్నారు. అనంతరం మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, తిమ్మాపూర్ ఎంపీపీ కేతిరెడ్డి వనితాదేవేందర్‌రెడ్డిని మండల పరిషత్ అభివృద్ధి సంఘం తరపున శాలువాతో ఘనంగా సన్మానించారు. తిమ్మాపూర్ ఎంపీపీ, ఎంపీడీవోలు ఈనెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు తీసుకోనున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈడ బోయిన శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు


ఎంపీపీని సన్మానిస్తున్న సంఘం నాయకులు

పవర్ లిఫ్టింగ్‌లో బంగారు, వెండి పతకాలు

రామడుగు: మండలంలోని చిప్పకుర్తి గ్రామానికి చెందిన పులి ఆంజనేయులుగౌడ్ పవర్ లిఫ్టింగ్‌లో రెండు పతకాలు సాధించాడు. హైదరాబాద్‌లోని శంషాబాద్‌లో తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 350,335 కేజీల విభాగంలో బంగారు, వెండి పతకం సాధించారు. జాతీయ స్థాయిలో పతకాలను సాధించడమేకాకుండా అంతర్జాతీయ స్థాయి పతకాలు లక్ష్యంగా సాధన చేస్తున్నారు. పతకాలు సాధించిన అంజనేయులుగౌడ్‌ను కోచ్ మల్లేశం, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.


అవార్డులతో ఆంజనేయులుగౌడ్

చలో కేశవపట్నం పోస్టర్ ఆవిష్కరణ


గన్నేరువరంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గన్నేరువరం: శంకరపట్నం మండలం కేశవపట్నంలో 12న ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాల ఉప కులాల ఆత్మగౌరవ సమ్మేళనం నిర్వహించనున్నామని సంఘం నాయకులు తెలిపారు. సోమవారం మండలకేంద్రం గన్నేరువరంలో మండల అధ్యక్షుడు హన్మండ్ల మల్లేశం ఆధ్వర్యంలో సమ్మేళనం పోస్టర్ జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాసూరి మల్లికార్జున్, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు వెన్న రాజు ఆవిష్కరించారు. సమ్మేళనానికి సంఘం సభ్యులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకరపట్నం మండల కార్యనిర్వాహక సభ్యులు బక్కి అనిల్, బక్కి రాజేందర్, గన్నేరువరం మండల కమిటీ గౌరవ సలహాదారులు న్యాత సుధాకర్, ఉపాధ్యక్షుడు కర్నె కొమురయ్య, మీసాల ప్రభాకర్, న్యాత రాజేందర్, న్యాత కొమురయ్య, న్యాత రాజేశం, హన్మండ్ల శ్రీనివాస్, హన్మండ్ల రాజేశం, తుమ్మ శంకర్, మాసం మీనయ్య పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థికసాయం

చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట్ గ్రామంలో బోయిని నర్సవ్వ మృతి చెందగా హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ దహన సంస్కారాలకు రూ.10వేల ఆర్థిక సాయం చేయగా, సోమవారం బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు మామిడి అంజయ్య నర్సవ్వ కుటుంబ సభ్యులకు అందించారు. వెంట సర్పంచ్ సుద్దాల ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీపీ అందె సుజాతపోచయ్య, మండల ప్రధానకార్యదర్శి మంకు శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రచార కార్యదర్శి బెజ్జంకి రాంబాబు, మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు బోయిని మనోజ్‌కుమార్, నాయకులు పిల్లి వేణు, రవీందర్, బోయిని సారయ్య, బోయిని రమ, మల్లేయ్య, బాలయ్య, శ్రీను, సదయ్య పలువురు ఉన్నారు.


ఆర్థిక సాయం అందిస్తున్న మామిడి అంజయ్య

కంటి వెలుగు శిబిరం ప్రారంభం

చొప్పదండి: మండలంలోని సాంబయ్యపల్లి గ్రామంలో సోమవారం రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ చిలుక రవీందర్ ప్రారంభించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రామకృష్ణ, అక్షిత, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా


రాజేశ్, ఎస్సై

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల నిరుద్యోగులు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 11వ తేదీన నిర్వహించే మెగా జాబ్ మేళాకు హాజరు కావాలని ఎస్సై సామల రాజేశ్ తెలిపారు. సోమవారం చిగురుమామిడిలో మాట్లాడారు. పది, ఆపై చదువు ఉన్న నిరుద్యోగులు కరీంనగర్‌లోని పద్మనాయక కల్యాణ మండపంలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నియామకం


నియామకపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

గంగాధర: బీఆర్ఎస్ యూత్ విభాగం చొప్పదండి నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా మండలంలోని మధురానగర్ గ్రామానికి చెందిన పెంచాల చందు నియామకమయ్యారు. సోమవారం ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ నియామక పత్రాలు అందజేశారు. నియామకానికి సహకరించిన నాయకులకు చందు కృతజ్ఞతలు తెలిపాడు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

జమ్మికుంట: పట్టణ, మండలంలోని వావిలాల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రాలను టౌన్ సీఐ బార్పటి రమేశ్ సోమవారం పరిశీలించారు. సీపీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు పట్టణం, మండలంలోని ఆరు పరీక్ష కేంద్రాలను పరిశీలించి పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఎవరూ ఉండకుండా చర్యలు చేపట్టాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిరాహార దీక్ష


నిరాహార దీక్ష చేస్తున్న బ్రిడ్జి పోరాట సమితి సభ్యులు

గన్నేరువరం: గన్నేరువరం మండలం మైలారం మైసమ్మ గుట్ట నుంచి కరీంగనర్ శ్మశానవాటిక వరకు లోయర్ మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మించాలని బ్రిడ్జి నిర్మాణ పోరాట సాధన సమితి చైర్మన్ సంపతి ఉదయ్ కోరారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలు, యువజన నాయకులు మద్దతూ తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నాలుగేళ్లు గడిచిచా ఎలాంటి స్పందన లేదన్నారు. కరీంనగర్‌కు వెళ్లాలంటే 40 కిలోమీటర్ల దూరం తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే గన్నేరువరం మండలంతో పాటు సిద్దిపేట, రాజన్న సిరిసిల్లా జిల్లాలోని బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు ఎంతో అనువుగా ఉంటుందని తెలిపారు. విద్య, ఇతరాత్ర పనులకు మండలాల్లోని ప్రజలు వెళ్లాలంటే దూరం తగ్గడంతో పాటు ఈ మండలాలు అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందని, అలాగే పర్యాటక కేంద్రంగా గుర్తింపు వస్తోందన్నారు. అనంతరం సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ తహసీల్దార్ అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బ్రిడ్జి పోరాట సాధన సమితి సభ్యులు పుల్లెల రాములు, పుల్లెల జగన్, కయ్యం సంపత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, ఉపసర్పంచ్ అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, పుల్లెల రాములు, పుల్లెల జగన్, కయ్యం సంపత్, రైతు కూలీ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బామండ్ల రవీందర్, గుండా వెంకటేశం, అటికం రామచంద్రం, కాల్వ నాగరాజు, గంప మహేష్, లక్ష్మణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

మానకొండూర్/మానకొండూర్‌రూరల్: సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాజిదాఅతహరి అన్నారు. నార్మల్ డెలివరీ ప్రయోజనాలను గర్భిణులకు వివరించాలన్నారు. మండలంలోని లక్ష్మీపూర్ ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. హాస్పిటల్‌లో సిబ్బంది పనితీరుని అడిగి తెలుసుకున్నారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ బియాబని, సిబ్బంది ఇజాజ్ తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి

రెడ్డి సంఘం ఎన్నికలు

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ గ్రామ రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా ఒంటెల గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అల్లెపు శ్రీనివాస్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రమణారెడ్డి, అజయ్‌రెడ్డి, కోశాధికారిగా నర్సింహారెడ్డి, సహాయ కార్యదర్శిగా రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షులుగా ముష్కె వెంకట్ రెడ్డి, అప్పిడి శ్యాంసుందర్ రెడ్డిలు నియామకమయ్యారు.

హద్దులు నిర్ణయించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి, ధర్మారం పరిధిలోని 431 సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుందని, హద్దులు నిర్ణయించాలని కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట పట్టణ మాజీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిలో శ్మశానవాటిక, బీడీకార్మికులకు, మసీదు నిర్మాణానికి, ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చారన్నారు. మిగిలిన భూమి సర్వే నంబర్ మార్పు చేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని పేర్కొన్నారు. జిల్లా సర్వేయర్ అధికారులతో హద్దులు నిర్ణయించి, ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కొండాపూర్‌లో బీరప్ప ఉత్సవాలు ప్రారంభం

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో బీరప్పస్వామి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఆలయం ముందు ఒగ్గు కళాకారులు పెద్దపట్నం వేశారు. నాలుగు రోజులు నిర్వహించే ఉత్సవాల్లో మొదటి రోజు స్వామివారికి కల్యాణం నిర్వహించారు. బుధవారం నాగవెల్లి ఉంటుందని, వివిధ వేషధారణలతో బీరప్పస్వామి ప్రాశస్త్యాన్ని ఒగ్గు కళాకారులు వివరించారు. కాగా ఆలయాన్ని నిర్వాహకులు అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దపల్లి భవానిఅరుణ్‌కుమార్, బీరప్ప కురుమ సంఘం సభ్యులు చిగుర్ల కుమార్, పోచయ్య, గుంటి ఓదయ్య, రాయికంటి రాజయ్య, శ్రీనివాస్, ప్రసాద్, గోవిందు, సది, మహేశ్, రవీందర్ పలువురు పాల్గొన్నారు.


బీరప్ప చరిత్ర వివరిస్తున్న ఒగ్గు కళాకారులు

చెక్‌డ్యాం మరమ్మతు పనులు చేయాలి

రామడుగు: మండలంలోని శ్రీరాములపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో సోమవారం జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు, బీఎస్ఎన్ఎల్ టెలికం అడ్వైజరీ కమిటీ సభ్యురాలు మామిడిపల్లి చైతన్య ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం మోతె గ్రామ శివారులో భారీ వర్షాలతో తెగిన చెక్‌డ్యాంను పరిశీలించి ప్రభుత్వం త్వరగా మరమ్మతు పనులు చేయాలని డిమాండ్ చేశారు. కార్య క్రమంలో బీజేపీ నాయకులు మహేందర్‌రెడ్డి, నర్సింగరావు, తిరుపతి, శ్రీనివాస్, రాజు, పర్శరాములు, మధు, ఉపసర్పంచ్ మహేష్ పలువురు పాల్గొన్నారు.


భోజనం చేస్తున్న మామిడిపల్లి చైతన్య